కథ

# అమ్మో! అమెరికా బతుకు

ఉషాబాల

"మార్కెట్‌లోకి కొత్త హైబ్రీడ్ విత్తనాలు వచ్చాయట నాన్నా..నిన్నో సారి వచ్చి మాట్లాడమన్నాడు ఆ షాప తను" అంటూ సైకిల్ స్టాండు వేసి లోపలికి వచ్చాడు మా రెండో వాడు. ఉదయాన్నే పొలం వెళ్లి పంట చూసుకుని కాస్తంత పచ్చిగాలి పీల్చుకుని రావడం వాడికి అలవాటు.

"ఏవిట్రా ఇంత చదువు చదివి బెంజి కార్లో తిరగాల్సినవాడివి. ఇలా మట్టి పిసుక్కుంటూ వ్యవసాయం అంటూ ఇక్కడే పడున్నావు. మీ నాన్న నా మాట వినుంటే నువ్వు కూడా మా వాడిలాగే రెండు చేతులా డాలర్లు సంపాదించేవాడివి" అంటూ లోపలికి వచ్చాడు మా కరణం బావ.

మా బావ నోరు విప్పాడంటే ఆ ప్రవాహానికి హద్దూ, ఆపూ ఉండదు. పొద్దున్నే వచ్చాడేంటబ్బా అనుకుంటూ కాస్త నవ్వు ముఖాన పులుముకుని "ఏంటి బావా భాస్కరంగారితోటే వచ్చేశావు?" రారా అంటూ కుర్చీ చూపించాను.

"వాడెవడు మధ్యలో? నేనొక్కడ్నే వచ్చాను. నువ్వు ఆ అవధాన్లగాడి గురించేనా అడుగుతున్నావు? వాడింకా నిద్ర లేచేడిస్తేగా? అయినా నాలా డిసిప్లైన్డ్ లైఫ్ ఎవరు మెయిన్‌టైన్ చెయ్యగలరు?"

"అయ్యో భాస్కరావధాన్ల గురించి కాదు బావా! ప్రత్యక్ష దైవం ఆ సూర్య భగవాన్లతోటే వచ్చేవేంటి? అన్నానంతే"

"చాల్లే నీ శ్లేషా నువ్వూనూ. ఇంతకీ నేనెందుకొచ్చానంటే ఇవాళ మా రామం బొంబాయి వెడుతున్నాడు. రేపు అక్కడ్నించే ఫ్లైటు. టౌనుస్టేషన్‌కి కారు మాట్లాడి పెట్టు అట్టే టైము లేదు" అంటూ తుఫాన్‌మెయిల్లా పరిగెత్తాడు.

హమ్మయ్య! పెద్ద దుమారం వెలిసింది. కరణంబావ ఎప్పుడూ అంతే. ఆయన పనులు చేసి పెట్టడానికి నేను కావాలి. నాతో మాట్లాడటానికి మాత్రం ఆయనకి టైముండదు. ఏవైనా అంటే 'నేను ఆ నీలా మట్టి పిసుక్కుంటున్నానా? (అంటే ఆయన దృష్టిలో వ్యవసాయం లెండి). కరణం గిరీతోటే నాకు క్షణం తీరిక ఉండదు. మా వాడు అమెరికా నుంచి ఫోన్ చేశాడంటే గంటలకి గంటలు అక్కడి సంగతులు చెబుతూ ఉంటాడు. మీ అక్క ఉన్నప్పుడు ఆవిడతో మాట్లాడడానికే తీరుబడి ఉండేది కాదు. ఇక నీతో నాకేవిటి?' అంటాడు. పాపం అక్క ఎలా భరించేదో ఈయనగార్ని అనిపిస్తుంది. నాకు తెలిసినప్పటి నుంచి బావ ధోరణి అంతే. అమెరికాలో చదువుకో ఉద్యోగానికో వెళ్లిన వాళ్ల తల్లిదండ్రులని నెత్తిన పెట్టుకునేవాడు. 'ఏం ఉంది ఇక్కడ? మట్టీ మశానం తప్ప. అదే అమెరికాలో అయితే అందమైన రోడ్లు, ఇళ్లు ముఖ్యంగా డిసిప్లిన్డ్‌గా ఉండే మనుషులు. ఇక్కడలా అమ్మలక్కలంతా చేరి అరుగుల మీద పోచికోలు కబుర్లు చెప్పరట. వాళ్లకి ప్రతి క్షణం విలువైనదే. ఇంకా ఊరించే జీతాలు, కోట్లకి పడగలెత్తిన మనుషులు' అంటూ అమెరికా గొప్పల చిట్టా విప్పేవాడు.

అప్పటిదాకా ఆయన కబుర్లు ఆసక్తిగా విన్నవారంతా ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చిప్ అంటూ పారిపోయేవారు. నాకు తప్పదు గాబట్టి నేనొక్కడ్ని మిగిలేవాణ్ని.

అక్కడికీ ధైర్యం చేసి "జీవితంలో దబ్బే పరమావధి కాదు బావా.. అవకాశాలు ఇక్కడ మాత్రం లేవూ" అంటూ ఓసారి నచ్చచెప్పబోయాను.

"ఠట్...నువ్వు మాట్లాడకు డబ్బు లేని వాడు దుబ్బికి కొరగాడని.. రూపాటి లేకుండా క్షణం ఉండు చూస్తాను. మీ నాన్న మాట వినకుండా నువ్విక్కడే పడున్నావు ఈ సూర్యచంద్రులు కాపురముంటున్న కొంపలోనే. ఓసారి పైకి చూడు. పెణక నేయించి ఎంత కాలమైంది? నీకిదే ఆనందం. నీ పిల్లలనైనా బాగుచేసే ఉద్దేశం ఉందా? అదీ లేదు" అనుకుంటూ వెళ్లిపోయేవాడు.

వాళ్ల అబ్బాయి అమెరికా వెళ్లిన కొత్తల్లో ఓ రోజు ఉదయాన్నే మా వీధి తలుపు తట్టాడు. ఎవరా? అనుకుంటూ నిద్రమత్తులోనే తలుపు తీసి చూద్దును కదా కరణం బావ. నోరు వెళ్లబెట్టాను అతగాడి వేషం చూసి. మల్లు పంచె స్థానంలో జీన్సుపేంటు, ఖద్దరు చొక్కా స్థానంలో టీ షర్టు. నెత్తికి హేటు, కాలికి బూటు. "ఏవిటి బావా ఈ పఠానువేషం?" నోరు పెగల్చుకుని అడిగాను.

"ఇదేం పగటివేషం కాదు. చూడు నా వయసు ఓ పది తగ్గినట్టు లేదూ. అమెరికాలో పిల్లలుంటే ఇదే అడ్వాంటేజీ. ఈ పాంటు చూడు ఆర్నెలల వరకు ఉతక్కపోయినా ఫరవాలేదట"

"దీన్ని ఇలాగే అన్నాళ్లు వేసుకుంటే నిన్ను 'ఏకవస్త్ర' అనాల్సి వస్తుందేమో బావా" అన్నాను వేళాకోళంగా.

బావకి చర్రున కోపం వచ్చింది. "మీ అక్క పోయాక ఇంటిపన్లకి మహా కష్టంగా ఉంటోంది. సరైన చాకలి దొరకడం లేదు. ఈ మాట మా వాడితో అంటే అక్కడ్నించి ఈ డ్రెస్సు పంపాడు. అయినా నీకు నన్ను చూస్తే అసూయలెద్దూ. అందుకే వంకరగా మాటాడుతూ ఉంటావు" ఇలా అవకాశం వచ్చినప్పుడల్లా మా పెద్దవాణ్ని చదువుకి, ఉద్యోగానికి అమెరికా పంపనందుకు నన్ను దెప్పుతూ, పంపితే ఎన్నెన్ని లాభాలు పొందవచ్చో సోదాహరణంగా వివరించేవాడు.

మా పెద్దవాణ్ని బాపట్లలో అగ్రికల్చర్ చదువులో చేర్పించే ముందు వాణ్ని పక్కకి పిలిచి మందలించాడుట. ఈ చదువుల వల్ల ఉపయోగం లేదు, హైద్రాబాద్ వెళ్లి వేరే చదువు చదివితే అమెరికా వెళ్లవచ్చు. మీ నాన్న ఛాదస్తం గురించి ఆలోచించకు. నువ్వు సుఖపడు. కుటుంబాన్ని సుఖపెట్టు అని హితబోధ చేశాడుట. మావాడి సమాధానం వాడి స్నేహితుని ద్వారా విని సుమతీకారుని పద్యం గుర్తొచ్చి సంతోషం అనిపించింది. వాడు లక్ష్మీదేవిని డాలర్లతో కొలవాలనుకోనందుకు అమ్మని, అమలాపురాన్ని వదలడానికి ఇష్టపడనందుకు.

ఆ తర్వాత రెండేళ్లకి మా బావ మొదటిసారి అమెరికా వెళ్లాడు. అప్పటి హడావిడి చూడాలి. "రాజు వెడల రవితేజములదరగ" అన్నట్టుగా దర్జాగా వెళ్లాడు. అక్కడి నుంచి ఓ జీన్సుపేంటు తెచ్చి బలవంతంగా నాచేత తొడిగించి మరీ ఆనందించాడు. కనబడినవాళ్లకి, కనబడని వాళ్లకి ఆ భూతలస్వర్గ విశేషాలు చెప్పేవాడు.

ooo

అలాంటివాడు ఈమధ్యనే "పొలం పుట్రా అమ్మి ఇక కొడుకు దగ్గరకి వెడతాను. ఇక్కడ వండుకు తినడం కష్టంగా ఉంది" అని వెళ్లాడు. అక్కడికీ వెళ్లే ముందు చెప్పాను. "మరోసారి ఆలోచించు బావా. నేనున్నా కదా" అన్నాను. "నా కొడుకు రత్నంరా. నన్ను తన దగ్గరకే వచ్చెయ్యమన్నాడు. వాడుండగా నాకేం ఖర్మ ఇక్కడా అక్కడా పడుండడానికి?" అంటూ వెళ్లాడు.



ENTERED



అలా వెళ్లిన వాడు ఆర్నెళ్లు తిరక్కుండానే తిరిగొచ్చాడు. ఎప్పుడూ మా ఇంటికి వచ్చేవాడు. వచ్చి నాల్గు రోజులైనా మనిషి జాడలేదు. చుట్టుపక్కల వాళ్లు కూడా కనిపించలేదని చెప్పారు. ఏమైందో? అనుకుంటూ వాళ్లింటికి వెళ్లాను.

తలుపు ఓరువాగ్గా వేసుంది. తీసుకుని లోపలికి వెళ్లాను. పనివాడు రాజయ్య బత్తాయి రసం బావ చేత తాగిస్తున్నాడు. మనిషి బాగా నీరసంగా ఉన్నాడు. కళ్లల్లో జీవకళ లేదు. బావని ఆ పరిస్థితుల్లో చూస్తే నా గుండె కలుక్కుమంది. ఎందుకో పలకరించడానికి నాకు ధైర్యం చాల్లేదు కాసేపాగి-

"అమెరికా ప్రయాణం బాగా జరిగిందా బావా" అన్నాను.

అంతే మలేరియా రోగిలా వణికిపోతూ తోక తొక్కిన త్రాచులా లేచాడు నా మీదకి.

"అమెరికా అన్నావంటే ఛంపేస్తాను" ఉగ్రనరసింహంలా ఊగిపోతూ అన్నాడు.

అనుమానంగా రాజయ్య వైపు చూశాను.

"ఏమో బాబూ ఏటయినాదో అక్కడి నుంచి వచ్చినప్పట్నించి ఇదే ధోరణి" వాణ్ని మెల్లిగా అక్కణ్నించి బయటికి పంపించి బావ మంచం దగ్గరగా కుర్చీ జరుపుకుని అతని చేతిని నిమురుతూ "ఏవైంది బావా చెప్పు" లాలనగా అడిగాను.

అంతే కట్టలు తెంచుకున్న వరద గోదారయ్యింది అతని పరిస్థితి. నేను కంగారుపడ్డాను. నా దృష్టిలో ఆయనెప్పుడూ మేరునగధీరుడే. ఇలా రాళ్ల గుట్టలా పడుండటం చూసి తట్టుకోలేకపోయాను నాకూ కన్నీరాగలేదు. తరచి తరచి అడగ్గా అప్పుడు చెప్పాడు.

"నేను కొడుకుని అమెరికాకి తాకట్టు పెట్టాన్రా. ఇన్నాళ్లూ నేను ఓ రంగుల వలలాంటి ప్రపంచాన్ని సృష్టించుకుని అందులోనే ఆనందం ఉందనుకుంటూ మిమ్మల్ని కూడా అందులో పడమని అడిగాను. కానీ నువ్వు చాలా తెలివైనవాడివిరా. నీ పిల్లలు నీ మాట విన్నారు. వాళ్లు సుఖపడుతూ నిన్నూ సుఖపెడుతున్నారు"

"ఇప్పుడు నీకు మాత్రం ఏమైంది. చెప్పు. రత్నంలాంటి వాడు నీ కొడుకు"

"అవును రత్నమే. వాడికి నా డబ్బు మాత్రం కావాలి. నేనిచ్చిన రూపాయలు వాళ్లకి చాలా స్మాల్ ఎమౌంట్‌ట. నేనిన్నాళ్లూ మనిషికి డబ్బుంటే అన్నీ ఉన్నట్టే అనుకున్నాను. కానీ మనిషికి


మనిషి తోడు లేకపోతే ఏవీ లేనట్టే. అమెరికాలో దొరకనిది అదే...నా కోడలు లక్షాధికారి బిడ్డ. అయినా దాలర్ల కోసం ఉద్యోగం వెలగబెడుతోంది. ఇద్దరూ సూర్యోదయానికి వెడతారు. చంద్రోదయం తర్వాత ఇంటికి చేరతారు. వచ్చాక కూడా అదేదో చాటింగుట. పార్టీలట, ఇదే జీవితం. అలాంటి చోట నా పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించు. మాట్లాడేందుకు మనిషి లేక ఉన్నా భాష రాక, ఎంతో సతమతమయ్యానో.

పొద్దునే బ్రెడ్, బటరు తిని కాఫీ తాగి కూర్చోడం, మధ్యాహ్నం ఫ్రిజ్ లోంచి చద్ది భోజనం తీసుకుని తిని ఓ కునుకు తీయడం. లేచింతర్వాత మళ్లెప్పుడు వస్తారా అనుకుంటూ నాలుగు గోడలూ చూస్తూ కూచోడం. టీవీ పెడితే నల్లజీబోతుల్లాటి మనుషులు, హిప్పీజుట్లతో వెర్రి గెంతులు వేస్తుంటే ప్రోగ్రాములే వచ్చేవి. ఓ పాటా, పద్యమా? వారికంటే రామాయణంలో లంకరాక్షసులే చాలా అందంగా ఉండేవారేమో.

ఒక్కోసారి నాకేమనిపించేదంటే మన ఊళ్లోలాగా దోమలున్నా బాగుణ్ను. వాట్ని కొట్టుకుంటూంటే నాన్న కాస్త కాలక్షేపం అవుతుంది అని. ఇక్కడ చూడు ఇలా కిటికీ తీస్తే కనీసం గేదెలో, మేకలో కనబడతాయి. అక్కడ కర్టెన్ తప్పించి బయటికి చూస్తే బారులు తీరి పరిగెత్తిన కార్లు ఎండమావుల వెంట పడే దాహార్తుల్లా ఉంటాయి. కానీ ఎక్కడా ఓ నరమానవుడు కనబడడు. వంటింట్లోకొచ్చి పిల్లయినా పాలు తాగితే బాగుండునని అనుకునేవాడిని.

"అయ్యో అదేం కోరిక బావా?" అన్నాను.

"మరదే. దాన్ని కర్రతో తోలినప్పుడు అది భయంగా పరిగెట్టినపుడు మనకెంత విజయోత్సాహం కలుగుతుందని"




కానీ అక్కడ పిల్లి కాదు కదా నల్లి కూడా కనబడదాయె.

"నేనేమో భోజనప్రియుణ్నాయె. ఆ విషయం నీకూ తెలుసు కదా ! ఎప్పుడూ భోజనం చద్ది పెట్లో పెట్టా వెచ్చపెట్లో పెట్టా తర్వాత ప్లేట్లో పెట్టా. ఇదే తంతు. వేడివేడిగా నవకాయ పిండివంటలతో కాకపోయినా నాలుగు ఆధరవులతో భోంచేసేవాడినా. ఎలా అయిపోయానో చూడు"

"నిజమే బావా" జాలిగా చూశాను.

"వెళ్లిన కొత్తల్లోన ఆదివారం పొద్దున్నే మా కోడలు హడావడి పడుతూ వంట చేస్తుంది. పోపు సువాసనలు నా ముక్కుపుటాలని తాకుతూ నోరూరిస్తున్నాయి. హమ్మయ్య ఇవాళైనా చద్దికూడు తినే బాధ తప్పింది కదాని ఎప్పుడెప్పుడు భోజనానికి రమ్మంటుందాని ఎదురుచూస్తున్నాను. వంటంతా అయ్యాక ఫ్రిజ్ తెరచి చేసిన వంటలన్నీ పేక్ చేస్తూ వాటి మీద సన్‌డే, మన్‌డే అంటూ వరసగా వారాలపేర్లు, లేబుల్స్ అంటిస్తోంది. అప్పుడే నాకనుమానం వచ్చింది. ఇవాళైనా వేడివేడి భోజనం చేసే రాత ఉందా లేదా అనుకుంటూ" అమ్మా! ఆకలేస్తోంది. భోజనం వడ్డిస్తున్నావా? అన్నాను.

ఒక్క నిముషం మావయ్యగారూ అంటూ క్రిందటి వారం ఫ్రిజ్‌లో పెట్టిన సన్‌డే లేబుల్ ఉన్న పేకింగ్ తీసి వెచ్చపెట్టి అదేదో మైక్రోవేవ్‌ట అందులో పెట్టి వడ్డించింది. మరవన్నీ ఏవిటమ్మా అడగలేక అడిగా. ఇవన్నీ వచ్చే వారానికి మావగారూ. రోజూ వండుకోడానికి టైం లేదు కదా! అంది. జిహ్వా చచ్చిన నాలుకను తడుపుకుంటూ అదే అమృతం అనుకుని తిన్నాను.

ఓ రోజూ నాకిక్కడేం తోచట్లేదమ్మా అంటూ నా గోడు వెళ్లబోసుకున్నాను. "అయ్యో అలాగైతే నేను వెళ్లిన తరువాత ఆ డిష్ వాషర్‌లో గిన్నెలు వేసి, కార్పెట్ ఏరియా అంతా వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయండి. మీకు కాలక్షేపం అవుతుంది. నాకు కొంచెం సాయం చేసినట్టు ఉంటుంది అంది." అవి ఎలా ఆపరేట్ చేయాలో కూడా చెప్పింది. కానీ

## ఒంటరిగానే బావుంది

**బాలీవుడ్** భామ లారాదత్తా-కెల్లీ దోర్జీతో 'దోస్తీ'ని కట్ చేసుకున్నాక ఇక ఎవరితోనూ జత కట్టలేదు. పెళ్లి వూసుల్ని కూడా రానివ్వడంలేదు. 'నేనిప్పుడు ఇలా ఒంటరిగానే హాయిగా వున్నాను. కెల్లీతో అనుబంధం బెడిసికొట్టాక ఇక పెళ్లి గురించిన ఊసు నా ఆలోచనల్లో రావడంలేదు. అయినా ప్రస్తుతం సినిమాలతో బిజీగా వున్నాను. కొన్నేళ్ల దాకా పెళ్లి గురించి ఆలోచించదల్చుకోలేదు'- అంటోంది లారా.



నా బుర్రకే ఏవీ ఎక్కినట్టు లేదు. గిన్నెలన్నీ అందులో వేసి స్విచ్ ఆన్ చేశాను. అంతే మన ఊరి రామథోలు మేళంలా పెద్ద పెద్ద శబ్దాలు. క్రింద నుంచి నీళ్లు కాలువ కట్టాయి. ఏం చేయాలో తెలీక స్విచ్ ఆపేశాను. ఆ నీళ్లు తుడుద్దామంటే చీపురు కనబడదే.

సరే ఆ పని అక్కడ వదిలేసి కార్పెట్ క్లీనింగ్ కోసం వాక్యూమ్ క్లీనర్ ఆన్ చేశాను. చండ్ర ప్రచండ వేగంతో గాలి. గుయ్‌మంటే నేల మీద కాగితాలు సామాన్లు సీలింగ్‌కి కొట్టుకున్నాయి. నా గుండె గొంతులో కొట్టుకోవడం మొదలెట్టి ఆ స్విచ్ కూడా ఆపేశాను. ఇల్లంతా వానరమూక తొక్కి పడేసిన అశోకవనంలా ఉంది. ఆఫీసు నుంచి వచ్చిన కోడల్ని చూసేసరికి చెవి మెలి పెట్టి గోడకుర్చీ వేయించిన మేష్టారిని చూసినట్లయింది నా పరిస్థితి.

చెట్టంత మగాణ్ని కన్నీరు పెట్టుకుంటే బావుండదని బాత్రూంలోకెళ్లి భోరుమన్నాను. ఆ క్షణంలో మీ అక్కతో పాటే ఆ భగవంతుడు నన్ను కూడా తీసుకెళ్లిపోతే బాగుండేది అనిపించింది.

మరో రోజు ఇంట్లో కూచుంటే లాభం లేదనుకుని రోదసీ యాత్రకునిలా డ్రెస్ వేసుకుని అవును మరి రోడ్డు మీద అరికాలి మందం మంచు. పైగా పిచ్చిచలాయె వాకింగ్‌కని బయలుదేరా. కాస్త దూరం వెళ్లేసరికి దారి తప్పానేమోనని అనుమానం వచ్చింది. రోడ్డు మీద కార్లు. అక్కడక్కడ విసిరేసినట్టు ఇళ్లు. భయంవేసి మళ్లీ వెనక్కి తిరిగా. కానీ ఇల్లు పట్టలేకపోయా. కాళ్లలో చిన్నగా వణుకు మొదలైంది. ఇల్లు చేరతానో లేదోని. వెళ్లే కారునల్లా హెల్ప్ అంటూ ఆపాను. ఆఖరికి ఓ తెల్ల ఆసామి ఆపాడు. నా గోడు వచ్చీ రాని ఇంగ్లీషులో చెప్పాను. ఫోన్ నెంబర్ అన్నాడు. దేవుడి దయ వల్ల గుర్తుండి చెప్పాను. అతనె లాగో గంటన్ని తిప్పి ఇంటికి చేర్చాడు. చావు తప్పి కన్ను లొట్ట పోయినట్టయింది నా పరిస్థితి. మా అబ్బాయి నన్నే అన్నాడు. ఇంట్లోనే ఉండక ఎందుకు బయటకి వెళ్లావు? ఇంటర్నెట్‌లో తెలుగుపేపర్లు ఉంటాయి చదువుకో అన్నాడు. ఓ రెండు రోజులు ఎలాల పెట్టాలో చెప్పాడు. మూడో రోజు కంప్యూటర్ ముందు గర్వంగా కూర్చున్నాను. చేతిలో చుంచుని పట్టుకుని "అదే వాళ్లు దాన్ని మౌస్ అంటారు"లే ఏదో నాలుగు సార్లు అటూఇటూ కదుపుతూ నొక్కాను. ఏవీ లేదు సరి కదా అది కుయ్‌మందం మొదలెట్టింది. కాసేపాగి చూశాను. అది ఉలుకు పలుకూ లేదు. రాత్రి మావాడొచ్చి "నాన్న దీన్నేం చేశారు"? గట్టిగా అరిచాడు. నేను నీళ్లు నములుతూ నిలబడ్డాను. చూడండి. మీరు సరిగా ఆపరేట్ చెయ్యలేదు. మదర్ బోర్డ్ ప్రాబ్లం అయిందనుకుంటా. మీరు ఇక దీన్ని ముట్టుకోకండి" అన్నాడు.

వాడు ఆ మదర్ బోర్డు ప్రాబ్లం గురించి పడే తపన ఈ ఫాదర్ ప్రాబ్లం గురించి పట్టించుకోనందుకు కోపం వచ్చింది.

ఆ రాత్రి వాడితో చెప్పాను. నాకు సాధ్యమైనంత త్వరగా ఇండియా టికెట్ కొనమని.

"అదేవిటి నాన్నా" అన్నాడు.

నేనిక్కడ ఒక్క క్షణం కూడా ఉండలేను. అయినా మీరు మాత్రం ఇక్కడెందుకు? సంపాదించింది చాలు. మీరూ వచ్చేయండి" అన్నాను.

"మేం అక్కడికొచ్చి ఏం చేస్తాం. అయినా ఇక్కడ చాలా కమిట్‌మెంట్స్ ఉన్నాయి రావడానికి కుదరదు" తెగేసి చెప్పింది కోడలు.

"నాన్నా అప్పుడు అమెరికా వెళ్లండి వెళ్లండి అన్నారు. వచ్చాము. ఇప్పుడు ఇక్కడి పరిస్థితుల బట్టి మేం రాలేము నాన్నా. నీకు టికెట్ కొంటాను వెళ్లు అంటూ ఫ్లైట్ ఎక్కించాడు. ఇదిగో బతుకుజీవుడా అనుకుంటూ ఇలా వచ్చి పడ్డాను.

ఎప్పుడూ పది మంది వందిమాగదుల మధ్య తిరిగిన బావకి అమెరికా నరకమే మరి. పోనీలే ఇప్పటికైనా తెలుసుకున్నాడని సంతోషించాను.

సరే ఇక్కడ ఒంటరిగా ఏం ఉంటావు. ఇన్నాళ్లూ రమ్మంటే రానన్నావు. పద మాతోపాటే ఉందువుగానీ అంటూ లేచాను.



"నేనూ అదే అడగాలనుకుంటున్నాం. మొహమాటం వేసింది. నన్నూ మీలో ఒకడిగా ఉండనిస్తావా" దీనంగా అడిగాడు.

తప్పకుండా. నువ్వు ఆజ్ఞాపించాల్సినవాడివి. అర్థించాల్సిన వాడివి కాదు బావా. పద అంటూ ఇంటికి తాళం వేయించి బయలుదేరాం.

మా ఇంటి వసారాలో వాళ్ల నాన్నమ్మ వళ్లో కూర్చొని నా పెద్ద మనవడు "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అంటూ తెలుగు పాటలు వల్లిస్తున్నాడు. వాణ్ని మురిపెంగా ఎత్తుకుని ముద్దాడుతూ "ఎంత బాగా అన్నావు ఎవ్వరు నేర్పిన మాటరా! వేలిడైనా లేవురా, వేదంలా వినిపించే మాట" అంటూ దూరంగా రేడియో వస్తున్న పాటతో గొంతు కలిపాడు మా కరణం బావ.

బావ కళ్లలో తిరిగొచ్చిన జీవానికి నాకూ ఆనందమనిపించింది.

## ఎంత ప్రేమో!

ఇటీవల 'నక్షత్ర' డైమండ్ పబ్లిసిటీ కాంపైన్‌కి మోడల్‌గా సెలెక్ట్ అయింది కత్రినా. **2004** నుంచి ఐశ్వర్యారాయ్ చేస్తున్న ఈ డ్యూటీని కత్రినా ఎగరేసుకుపోయింది అనే కామెంట్లు వినిపిస్తుంటే- అభిషేక్ బచ్చన్ రియాక్టయ్యాడు. 'ఐశ్వర్యను తొలగించి మరొకరికి ఈ పబ్లిసిటీ బాధ్యతను అప్పగించారనడం సరికాదు. ఐశ్వర్య చెప్పిన కొన్ని షరతుల్ని వాళ్లు ఒప్పుకోనందుకే 'నక్షత్ర'ని వదులుకుంది' అంటూ భార్యని వెనకేసుకొస్తున్నాడు.